అన్నపూర్ణాదేవి... పాహిమాం!



కడప అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవిగా అలంకరణ



లలిత పంచాయతన ఆలయంలో గాయత్రీదేవిగా...

జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి ఇందులో భాగంగా మూడో రోజు శనివారం ఆలయాల్లోని అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళాభక్తులు కుంకుమార్చనలు చేశారు. పలు చోట్ల సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, బృందం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శారదాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

పులివెందుల ఆర్డీవోగా ప్రత్యూష



పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల ఆర్డీవోగా భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న వెంకటేశులును ప్రభుత్వం జీఏడీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గ్రూపు-1 ద్వారా ఎంపికై శిక్షణ పూర్తయిన ప్రత్యూష తొలి పోస్టింగ్‌గా పులివెందులకు వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూపరంగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆర్డీవో గండి అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పక్కన నాయకులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ప్రభుత్వం పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ రీజియన్ కార్యాలయంలో శనివారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని తెలిపారు. 117 జీవోను వెంటనే రద్దు చేయాలని తెలిపారు. విద్యాశాఖలో అక్రమ బదిలీలు చేపట్టకుడదని అన్నారు. నాయకులు సత్తార్, శ్రీనివాసులురెడ్డి, సుబ్బయ్య, అన్వర్‌బాషా, భూపాల్‌రెడ్డి, సీతారామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


టెట్‌కు 1,020 మంది హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) శనివారం కూడా కొనసాగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మూడో రోజు 1,147 మందికి 1,020 మంది హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో అనురాధ తెలిపారు.

వారి పాపాలే వీరికి శాపాలై!

ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది బలి

మైదుకూరు, వీరబల్లి మండలాల్లో వైకాపా నేతల అక్రమాలు



గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు చేయించిన పాపాలు రెవెన్యూశాఖ అధికార యంత్రాంగానికి చుట్టుకున్నాయి. ప్రయోగాత్మకంగా చేయించిన విచారణలో పాపాల పుట్టలు పగులుతున్నాయి. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల అంతటా విచారణ చేపట్టే పక్షంలో ఎవరూ మిగిలేలా కనిపించడంలేదు. ఇప్పటికే వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలంలో తహసీల్దారు సహా 15 మంది రెవెన్యూ సిబ్బందికి సంజాయిషీ తాఖీదులు జారీ చేశారు. వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా మొదటి దశ ప్రక్రియ చేపట్టారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలోనూ ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో సగానికి పైగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు విచారణలో తేలింది. ఇక్కడ కూడా ప్రక్రియ జరిగినప్పుడు పనిచేసిన తహసీల్దారు, సిబ్బందిని బాధ్యులను చేసే అవకాశం ఉంది. వీరికి కూడా ఒకట్రెండు రోజుల్లో సంజాయిషీ తాఖీదులు జారీ చేయనున్నట్లు జిల్లా ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. - ఈనాడు, కడప

- వీరబల్లి మండలంలో 4,774 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించగా, వాటిలో 2,022 ఎకరాల వరకు నిబంధనలకు విరుద్ధంగా చేసినట్లు విచారణలో తేలింది. ఫ్రీహోల్డ్ చేసిన భూములను 266 రిజిస్ట్రేషన్లు జరగ్గా, వీటిలో నిబంధనలకు విరుద్ధంగా 95 వరకు అక్రమంగా జరిగినట్లు వెల్లడైంది.

- వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలంలో 2,788 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి తొలగించగా, 576 ఎకరాల వరకు అక్రమంగా తొలగించినట్లు గుర్తించారు. ఏకంగా తెలుగుగంగ, జాతీయ రహదారులు, నివాసం ఉన్న ఇళ్ల స్థలాలను సైతం ఫ్రీహోల్డ్ జాబితాలో కలిపేసినట్లు తేలింది.

- వైకాపా నాయకులు భూములతో అవసరం లేకుండా తమ ఖాతాలో విస్తీర్ణం చూపించుకునే ఎత్తుగడలో భాగంగా భూదందా సాగించినట్లు తెలుస్తోంది. భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం, ఇతరత్రా అవసరాలకు దస్త్రాలు వాడుకుంటున్నట్లు విచారణలో తేలింది. అక్రమాలపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా కఠినంగా వ్యవహరిస్తున్నారు. తరచూ పర్యవేక్షిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మైదుకూరులో ప్రభావిత గ్రామాలు

వనిపెంట, నంద్యాలంపేట, గంజికుంట, మిట్టమానుపల్లె, శెట్టివారిపల్లె, తిప్పిరెడ్డిపల్లె, మాదిరెడ్డిపల్లె, అద్దిరెడ్డిపల్లె, గడమాయపల్లె, అన్నలూరు, శివపురం, ఎస్.మైదుకూరు, ఎన్.మైదుకూరు, సోమయాజుపల్లెలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. నంద్యాలంపేట, వనిపెంట, అన్నలూరు, శెట్టివారిపల్లెలో ఎక్కువ విస్తీర్ణంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలింది.

తాఖీదులందుకున్న వీఆర్వోలు

జె.రామలక్ష్మమ్మ, ఎ.వెంకటసుబ్బయ్య, బి.బాలనరసింహారావు, పి.ఓబుల్‌రెడ్డి, వై.ఓబులేశు, బి.మధు దేవిడ్, టి.మంజులాదేవి, ఎస్వీ నాగేంద్ర, బి.ప్రతాప్‌లు ఉన్నారు. వీరిలో పలువురు ఒకటి కంటే ఎక్కువ గ్రామాలకు వీఆర్వోలుగా వ్యవహరిస్తున్నారు. తాఖీదులు అందుకున్న సిబ్బంది పని దినాల్లో రెండు రోజుల వ్యవధిలో రాత మూలకంగా సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వంతెన ఛిద్రం... జరభద్రం!



బద్వేలు-చిల్లకనుమ మీదుగా కడప వెళ్లే మార్గంలో నాగసానిపల్లె వద్ద వంతెన ఛిద్రమైంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెల్లూరు, కావలి, విజయవాడ, గుంటూరు, బద్వేలు, ఖాజీపేట చెందిన వారు కడప వెళ్లేందుకు మైదుకూరు చుట్టుకుని వెళ్లాలంటే 12 కిలోమీటర్ల దూరం పెరగడంతో అనేక మంది చిల్లకనుమ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై రహదారులు, భవనాల శాఖ డీఈఈ సలీం మాట్లాడుతూ వంతెనకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, బద్వేలు


గిరిజనులకు కొండంత భరోసా!

జిల్లాలో 10 గ్రామాల్లో పీఎంజేయూజీఏ అమలుకు ప్రణాళికలు

- న్యూస్‌టుడే, కడప

గిరిపుత్రులకు ఉపాధి కల్పించి జీవనానికి భరోసా కల్పించాలని సదాశయంతో కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌ను త్వరలో అమలు చేయాలని ఇప్పటికే కసరత్తు చేశారు. దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న గ్రామాలను ఎంపిక చేశారు. కొండంత భరోసా ఇచ్చేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- జిల్లాలో వెనుకబడిన 3 మండలాల్లో 10 గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. పులివెందుల మండలం కోనంపల్లి, చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లి, చిన్నకాంపల్లి, ఇప్పెంట, జమ్మలమడుగు మండలం అంబవరం, గూడెంచెరువు, పాత బొమ్మేపల్లి, సున్నపురాళ్లపల్లి, పెద్దదండ్లూరు, సిరిగేపల్లి గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో 2011 జనాభా లెక్కల మేరకు 5,379 మంది ఉండగా, దశాబ్ద కాలంలో చూస్తే వీరి సంఖ్య మరింత పెరిగింది.



జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామం

కల్పించనున్న సౌకర్యాలు : ● సొంతిల్లు లేనివారికి పక్కాగృహం మంజూరు ● రహదారులకు మరమ్మతులు ● ప్రతి గడపకు రక్షిత జలాల సరఫరా ● విద్యుత్తు సరఫరా మెరుగుదల ● సౌర వెలుగులకు పరికరాల పంపిణీ ● మెరుగైన వైద్యసేవలు ● ఆయుష్మాన్‌భవ కార్డుల పంపిణీ ● గ్యాస్ కనెక్షన్ల మంజూరు ● అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, పౌష్టికాహారం పంపిణీ ● అవసరాన్ని బట్టి వసతి గృహాల ఏర్పాటు ● నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ● రైతులు, పశుపోషకులు, మత్స్యకారులకు రాయితీపై సంక్షేమ పథకాలు ● టెలికం, డిజిటల్ సేవల విస్తరణ ● మార్కెటింగ్‌పై అవగాహన కల్పన

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌లో గిరిజన గ్రామాలను ఎంపిక చేశాం. సంక్షేమ, అభివృద్ధి పథకాలపై దృష్టిసారించాం. ఎస్టీలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతులు రాగానే అమలు చేస్తాం.

- సరస్వతి, జిల్లా గిరిజన అధికారిణి

నవంబరు 3 నుంచి పెద్దదర్గా ఉరుసు

16న గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన జేసీ అదితి సింగ్, ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, నాయకులు, అధికారులు

చిన్నచౌకు(కడప), న్యూస్‌టుడే : కడప నగరంలోని పెద్దదర్గా ఉరుసును విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. మత సామరస్యానికి అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా) ప్రతీకని కొనియాడారు. నవంబరు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రాలను దర్గా ఆవరణలోని ముషాయిరా మందిరంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. 16న గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉరుసుకు దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాల విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, పెద్దదర్గా పీఠాధిపతి ఆరిఫుల్లాహుస్సేనీ, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వివిధ పార్టీల నాయకులు అమీర్‌బాబు, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, సుభాన్‌బాషా, లక్ష్మీరెడ్డి, నజీర్ అహమ్మద్, జిలానీ బాషా, అఫ్జల్‌ఖాన్, మాసీమబాబు, బాధ్య డీఎస్పీ రమాకాంత్, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో నాగరాజు, డీఈవో అనురాధ, అధికారులు, దర్గా నిర్వాహకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు దసరా సెలవులు

వేంపల్లె : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్‌ఐటీల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు శనివారం స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ మేరకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సంబంధించిన బస్సులతో విద్యార్థులను వేంపల్లెకు తరలించారు. అలాగే క్యాంపస్ నుంచి కడప, పులివెందుల, రాయచోటి, అనంతపురం, తిరుపతికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఈ నెల 14న ఆయా క్యాంపస్‌లకు చేరుకోవాలని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

ఒంటిమిట్ట : ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్తులు దురాక్రమణ జరుగుతున్నట్లు సమాచారం రాగానే వెంటనే స్పందించి అడ్డుకోవాలని సూచించారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ఇప్పటికే జరిగిన ఆక్రమణలను జరిగిన ప్రాంతాలను గుర్తించి అక్రమార్కుల నుంచి భూములు, స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు రమణమ్మ తదితరులున్నారు.

యూసీఐఎల్ రహదారి నిర్మాణం వివాదాస్పదం

- రూ.50 కోట్లతో చేపట్టేందుకు పరిశ్రమ అధికారుల సన్నాహాలు
- ప్రస్తుతం ఉన్న రోడ్డునే విస్తరించాలని పట్టుబడుతున్న ప్రజలు

- న్యూస్‌టుడే, పులివెందుల, (వేముల)

వేముల మండలం మబ్బుచింతలపల్లె సమీపంలోని యురేనియం భవన సముదాయం నుంచి పరిశ్రమ వరకు గ్రామాలతో సంబంధం లేకుండా కొత్తగా రహదారిని నిర్మించేందుకు యూసీఐఎల్ సన్నాహాలు చేస్తోంది. ఈ దారి నిర్మాణం వివాదాస్పదమవుతోంది. ప్రస్తుతం ఉన్న ఒక వరుస రహదారిని రెండు వరుసలుగా విస్తరిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని పరిసర గ్రామాల ప్రజలు పట్టుపడుతున్నారు. యురేనియం భవన సముదాయం సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రస్తుతం ఒక వరస రహదారి ఉంది. ఈ రహదారితో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా పండ్ల తోటలు సాగులో ఉన్నాయి. అరటి, ఉల్లి, టమోట, చీనీ, బొప్పాయి తదితర వాటిని పెద్ద వాహనాలతో మార్కెట్‌కు తరలించాలంటే ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లి తీసుకొచ్చే వాహనాలు కూడా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. పరిశ్రమకు వెళ్లే కార్మికులు, ఉద్యోగుల వాహనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇరుకుగా ఉన్న రహదారిని విస్తరిస్తే మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె గ్రామాల ప్రజలతోపాటు పరిశ్రమకు వెళ్లేందుకు సులువుగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రెండు వరుసల రహదారికి అవసరమయ్యే భూసేకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని ప్రజలు ముందుకొస్తున్నారు. యురేనియం భవన సముదాయం నుంచి మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లెకు సంబంధం లేకుండా పరిశ్రమ వరకు నేరుగా ఎవరికి ఉపయోగపడని విధంగా కొండల నడుమ రూ.50 కోట్లతో కొత్తరహదారిని నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారనే విషయం తెలియడంతో పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. కొత్త రహదారి నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకించేందుకు సిద్ధమయ్యారు. ప్రజల డిమాండుతో కూడిన వినతిపత్రాన్ని పరిశ్రమ జీఎం ఎంఎస్‌రావ్‌కు మబ్బుచింతలపల్లె మాజీ సర్పంచి శ్రీనాథరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి ఇటీవల అందజేశారు. ప్రజలకు వ్యతిరేకంగా నూతన రహదారి నిర్మాణాన్ని చేపడితే అడ్డుకుంటామని వినతిపత్రంలో స్పష్టం చేశారు.



రహదారి నిర్మాణానికి ఎంపిక చేసిన దారిదే

సెలవులివ్వని కళాశాలలపై చర్యలకు డిమాండు

కడప విద్య, న్యూస్‌టుడే : దసరా సెలవులివ్వకుండా విద్యార్థులు, అధ్యాపకుల స్వేచ్ఛను హరిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం పీడీఎస్‌యూ నాయకులు కడప నగరంలో ఇంటర్మీడియట్ ఆర్జేడీ రవిని కలిసి వినతిపత్రం అందించారు. ఇంటర్‌బోర్డు నిబంధనలకు విరుద్ధంగా పలు కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు.

సులభ పద్ధతిలో మద్యం టెండర్లు



మాట్లాడుతున్న ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి రవికుమార్, పక్కన ఏఈఎస్ వినోద్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలో 2024-26 ఏడాదికి సంబంధించి 139 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని కడప ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి రవికుమార్ తెలిపారు. శనివారం ప్రకాష్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. . ఒకరు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. జిల్లాలో ఏ దుకాణానికైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 9వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న కడప జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా ద్వారా దుకాణాలు కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 110 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, ఎర్రగుంట్ల, ముద్దనూరు, మైదుకూరు, బద్వేలు, సిద్దవటం ఎక్సైజ్ ఠాణాల్లో కూడా దరఖాస్తు అందజేయవచ్చునన్నారు. చివరి రోజు కాకుండా సమయం ఉన్నప్పుడే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలున్నా, అనుమానాలున్నా సంబంధిత ఎక్సైజ్ ఠాణా సీఐ, ఎస్సైలను సంప్రదించాలన్నారు. ఎక్సైజ్ ఏఈఎస్ వినోద్‌కుమార్, టాస్క్‌ఫోర్సు సీఐ విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

కడపలో లలితా జ్యువెలరీ షోరూం ప్రారంభం

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే : కడప నగరంలో శనివారం లలితా జ్యువెలరీ షోరూం ప్రారంభమైంది. సంస్థ ఎండీ కిరణ్‌కుమార్ జ్యోతి వెలిగించగా, ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. 56వ బ్రాంచ్‌ను కడప నగరంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఏ, బీ టౌన్‌లకు మాత్రమే పరిమితమైన లలితా జ్యువెలరీ త్వరలో సీ టౌన్‌లో కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రతి షోరూంలో మహిళలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఒక దుకాణాన్ని పూర్తిగా మహిళలతోనే ఏర్పాటు చేయాలనే ఉద్దేశంలో ఉన్నామన్నారు. బంగారు, వజ్రాలు, వెండి వస్తువులు కొనుగోలు చేసే వారు నాణ్యత గురించి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం ప్రాంతాల వారీగా అభివృద్ధి కోరుకుంటుందని, ఉత్పాదనారంగంలో పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కడపకు మరిన్ని వ్యాపార సంస్థలు రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లలితా జ్యువెలరీ షోరూం కడప నగరానికి రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి దంపతులను కిరణ్‌కుమార్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



జ్యోతి వెలిగిస్తున్న లలితా జ్యువెలరీ ఎండీ కిరణ్‌కుమార్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న విజయజ్యోతి, పక్కన నాయకులు

కడప, చిన్న చౌకు, న్యూస్‌టుడే : కాంగ్రెస్‌తోనే లౌకిక ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. కడపలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్ష మేరకు పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఉక్కు కర్మాగారానికి మూడుసార్లు శంకుస్థాపన చేసినా నిర్మించలేదన్నారు. నాయకులు సలావుద్దీన్, బండి జకరయ్య, సిరాజుద్దీన్, బాబు, గౌస్‌పీర్ తదితరులున్నారు.

● కడపకు చెందిన మైనుద్దీన్ శనివారం కడపలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

భారీగా గోవా మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గోవా మద్యం

ప్రొద్దుటూరు నేరవార్తలు: ప్రొద్దుటూరులో అక్రమ మద్యం నిల్వలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గోవా రాష్ట్రానికి చెందిన పెద్ద మొత్తంలో మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని గురవయ్యతోట సమీపంలోని ఓ ఖాళీ ఇంట్లో నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశారు. దాదాపు రూ.3 లక్షల విలువైన 816 ఫుల్ బాటిళ్లు, 10 రెండు లీటర్ల మద్యం సీసాలు, 72 బీరు సీసాలను ఒకటో పట్టణ ఠాణా పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమ మద్యం వ్యవహారంపై పోలీసులు ముమ్మర విచారణ చేస్తున్నారు. ఇప్పటికే ఇంటి యజమానిని విచారించి పలు వివరాలు సేకరించారు. వినాయకనగర్‌కు చెందిన రవి, అమృతనగర్‌కు చెందిన కాటం వీరేంద్ర అనే ఇద్దరు వ్యక్తులు నెల రోజుల క్రితం ఇల్లు బాడుగకు తీసుకున్నట్లు గుర్తించారు. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేసుకుని అక్రమంగా నిల్వ ఉంచుతున్నారని సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

విద్యార్థుల మహదానందం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి దర్శనంతో విద్యార్థులు మహదానందాన్ని పొందారు. జిల్లాకు చెందిన వివిధ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 560 మంది విద్యార్థులు వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ చొరవతో శనివారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీకాళహస్తి పట్టణానికి శుక్రవారం రాత్రి చేరుకున్న విద్యార్థులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎంఈవోలు భోజన, బస ఏర్పాట్లు కల్పించారు. శనివారం వేకువజామున దర్శన భాగ్యం కల్పించారు.

అక్రమ నియామకాలపై విచారణకు వినతి

మారుతీనగర్, న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయం, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాల్లో గత వైకాపా హయాంలో జరిగిన అక్రమ నియామకాలపై విచారణ చేపట్టి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్ శనివారం మంగళగిరిలో తెదేపా కార్యాలయంలో రవాణా క్రీడల శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. గత వైకాపా పాలనలో విశ్వవిద్యాలయాల్లో అవినీతి అక్రమాలు, అరాచకాలు మితిమీరి పోయాయని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అక్రమాలపై విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారని తెలిపారు.

కోటిరెడ్డి కళాశాలలో డిగ్రీ తక్షణ ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.సలీంబాషా పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశాలు పొందాలని తెలిపారు.

పెద్దదర్గాను సందర్శించిన ఆర్టీఐ ఛైర్మన్



ప్రార్థనలు చేస్తున్న ఆర్టీఐ ఛైర్మన్ సునీల్, తదితరులు

కడప, చిన్నచౌకు: కడప పెద్ద దర్గాను శనివారం ఆర్టీఐ ఛైర్మన్ సునీల్ సందర్శించారు. దర్గా నిర్వాహకులు ఆయనకు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. దర్గాను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు.

రాములోరి సేవలో... : ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని ఆర్టీఐ ఛైర్మన్ సునీల్ సందర్శించారు. రాములోరి సన్నిధికి విచ్చేసిన ఆయనకు తితిదే సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కల్యాణ మండపంలో సీతారామలక్ష్మణ బాలమూర్తులను దర్శించుకున్నారు. రామయ్య క్షేత్రం చారిత్రక వైభవం, ప్రాశస్త్యం ప్రత్యేకతలను అర్చకులు వివరించారు. అనంతరం సత్కరించి వేదాశీర్వాదం చేశారు. తహసీల్దారు రమణమ్మ, ఎస్.ఐ శివప్రసాద్, ఆర్.ఐ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ నూతన అధికారుల నియామకం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా ఎక్సైజ్‌శాఖకు కొత్త అధికారులను నియమించారు. కర్నూలు సెబ్‌లో పని చేస్తున్న ఎక్సైజ్ ఏఈఎస్ వినోద్‌కుమార్‌ను కడప ఎక్సైజ్‌కు బదిలీ చేశారు. నంద్యాల సెబ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్‌రెడ్డిని కడప ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు సీఐగా బదిలీ చేశారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారం వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగియగా, చిత్తూరు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది. చిత్తూరు జట్టు 76 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 56.3 ఓవర్లలో 124/6 స్కోరు చేసింది.

● కేవోఆర్ఎం మైదానంలో కడప, పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగియగా, కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది. ప.గో జట్టు 64.1 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 48.3 ఓవర్లలో 110/7 పరుగులు చేసింది.


వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందారు. కడప రాజారెడ్డివీధికి చెందిన బాలకొండయ్య (60) కోటిరెడ్డి కూడలి వద్ద నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీకొట్టింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి వచ్చి పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని బలవన్మరణం

ఖాజీపేట, న్యూస్‌టుడే: భార్య పుట్టింటికి వెళ్లిందన్న కారణంగా స్థానిక చెన్నముక్కపల్లె ఎస్సీకాలనీకి చెందిన ఆకుమల్ల నాగభూషణం (28) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు తెలిపారు. మద్యం మత్తుకు బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కారణంగా అతని భార్య తమ ముగ్గురి సంతానాన్ని తీసుకొని ఆమె పుట్టింటికి వెళ్లారు. ఈ క్రమంలో అతను భార్యాపిల్లలు తనను వదిలిపెట్టి వెళ్లారన్న బాధలో ఇంట్లోని సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

వీఆర్ఏ హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీనాయక్, పక్కన పోలీసులు

పులివెందుల(వేముల) న్యూస్‌టుడే : వి.కొత్తపల్లె వీఆర్ఏ నరసింహులు హత్య కేసులో నిందితుడి బాబును శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. పులివెందుల పోలీసుస్టేషన్‌లో హత్య కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన బాబు ముగ్గురాయి గనుల్లో పనులకు వెళ్తుండేవాడు. ఇదే గ్రామానికి చెందిన వీఆర్ఏ నరసింహులు భార్యతో సన్నిహితంగా ఉండేవాడు. దీంతో కుటుంబసభ్యులు బాబును మందలించడంతో నరసింహులుపై పగపెంచుకుని హత్య చేయాలని ప్రణాళిక రచించాడు. ఈ క్రమంలో గత నెల 29న రాత్రి నరసింహులు, భార్య సుబ్బలక్షుమ్మ ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా పేలుడు పదార్థాలను మంచం కింద పెట్టి పేల్చాడు. ఘటనలో నరసింహులు మృతి చెందగా భార్య సుబ్బలక్షుమ్మకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. తనపై కేసు పెట్టారని తెలియడంతో బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. శనివారం సాయంత్రం బాబు పులివెందులకు వస్తుండగా పాత కదిరి రహదారిలోని యురేనియం పరిశ్రమకు వెళ్లే మలుపు వద్ద సీఐ నాగరాజు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

ఘర్షణ కేసులో ముగ్గురు...

కమలాపురం: అప్పారావుపల్లెలో పొలం దారి విషయంలో జరిగిన ఘర్షణలో మృతి చెందిన శీలం రామకృష్ణారెడ్డి మృతికి కారకులైన అదే గ్రామానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ రోశన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న పొలం రస్తా విషయంలో రామకృష్ణారెడ్డితో ఎల్లారెడ్డి, చెన్నారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిలు ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో వారు రామకృష్ణారెడ్డిని తోసేయడంతో కిందపడి మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అప్పారావుపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్సై ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దసరా కొలువు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా బొమ్మల కొలువును ఏర్పాటుచేయడం ఆనవాయితీగా వస్తోంది. దుర్గాదేవి రాక్షస సంహార విజయానికి గుర్తుగా ఈ కొలువును నిర్వహిస్తారు. ప్రొద్దుటూరు పట్టణం కోటవీధిలో పురోహితుడైన మైదుకూరు శ్రీధర్ ఇంట్లో సంప్రదాయబద్ధంగా వెయ్యి బొమ్మలు ఏర్పాటు చేశారు. దార్, అమర్‌నాథ్, పెళ్లిసందడి, అయోధ్య, గోవులు, కిరాణాకొట్టు, దశావతారాల వల్లంత ప్రత్యేకతలను తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా సాయంత్రం వేళ మహిళలందరితో కలిసి పూజలు చేశారు.


ప్రొద్దుటూరులో ఏర్పాటైన బొమ్మల కొలువు

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు



నృసింహస్వామి ఆలయంలో పూజలు

ప్రొద్దుటూరు గ్రామీణ, బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు నరసింహాపురంలోని శ్రీలక్ష్మీనరసింహాలయంలో శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా విశేష పూజలు చేశారు. మూలవిరాట్ విగ్రహమూర్తులకు అభిషేకం అనంతరం వెండి ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామివారికి పూజలు, మొక్కులు చెల్లించారు. బద్వేలులోని వల్లెలవారి పల్లెలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి ఆర్జిత డీఎం శ్రీనివాసులు సహకారంతో 18 రకాల కూరగాయలతో శాకంబరీ అలంకారం చేశారు.

స్పందనకు వందనం

ప్రొద్దుటూరు పట్టణం: దస్తగిరిపేటలో మసీదు ఎదురుగా ఉన్న పెద్ద కాలువలో పూడికను తొలగించారు. ఈ సమస్యపై శుక్రవారం ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య అధికారి సునీత ఆదేశాల మేరకు కాలువలో పూడికను తొలగించారు.

?: ప్రొద్దుటూరు పట్టణం రిలయన్స్ పెట్రోల్ బంకు కూడలి నుంచి ఎర్రగుంట్లకు వెళ్లే బైపాస్‌రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. రోడ్డుపై వెళ్లాలంటే దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నాం. **-మాలే నాగరాజు, స్థానికుడు**

✔: గుంతలను పూడ్చేందుకు నిధులు విడుదలయ్యాయి. త్వరలో పనులు చేస్తాం. రోడ్డును శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాను.

* లక్ష్మీనరసింహులు, డీఈ, ఆర్‌అండ్‌బీ ప్రొద్దుటూరు, -దూదేకుల నరసింహులు, పంచాయతీ కార్యదర్శి, గోపవరం

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

?: బద్వేలు పురపాలకలోని విద్యానగర్‌లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కల్గుతోంది. పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. **-సుబ్బయ్య విద్యానగర్, బద్వేలు**

✔: విద్యుత్తు సరఫరాలో అంతరాయం విషయం మాదృష్టికి రాలేదు. వెంటనే పరిష్కరిస్తాం. **-కుళాయప్ప, ట్రాన్స్‌కో ఏడీఈ, బద్వేలు**

?: బ్రహ్మంసాగర్ నీరు వదిలినప్పుడు ట్యాపులు లేక నీరు వృథాగా పోయి బద్వేలు వీధులు రొంపిగా మారుతున్నాయి. నడవాలంటే ఇబ్బందిగా ఉంది. **- ఓబయ్య, సుమిత్రానగర్, బద్వేలు**

✔: వీధుల్లోని కుళాయిలకు ట్యాపులు ఏర్పాటు చేసి వీధులు రొంపిగా కాకుండా చర్యలు తీసుకుంటాం. **- నరసింహారెడ్డి, కమిషనర్ బద్వేలు**

?: పట్టణంలో డివైడర్లకు ఆనుకుని ఇసుక వ్యర్థాలు పేరుకుపోయాయి. వాహనాల ధాటికి దుమ్ము లేచి రాకపోకలకు కష్టంగా ఉంది. **-రామయ్య, బద్వేలు**

✔: డివైడర్లకు ఆనుకుని ఉన్న ఇసుక వ్యర్థాలు తొలగించి దుమ్ము లేయకుండా చర్యలు తీసుకుంటాం. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. **-నరసింహారెడ్డి, కమిషనర్, పురపాలక సంఘం, బద్వేలు -న్యూస్‌టుడే, బద్వేలు**

శక్తి స్వరూపిణి...ముక్తిప్రదాయిని


ప్రొద్దుటూరు: రాజరాజేశ్వరి దేవాలయంలో శారదాదేవి దర్శనం


కలసపాడు: అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ


బద్వేలు: అష్టలక్ష్మీ అలంకారంలో అమ్మవారు


గాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మ

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లోని ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానాల్లో భక్తులు కిటకిటలాడారు. గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దర్శన ఏర్పాట్లు చేశారు. -న్యూస్‌టుడే, [illegible] బృందం



కన్యతీర్థంలో వైష్ణవీదేవి అలంకారంలో అమ్మవారు


జమ్మలమడుగులో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు


ప్రొద్దుటూరు శివాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం


మైదుకూరు: శివయ్య సేవలో పార్వతీదేవి





విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని తెదేపా నేత, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య సూచించారు. శనివారం ప్రొద్దుటూరులోని శ్రీ కామిశెట్టి సుబ్బారావు చెన్నమ్మ (ఎస్‌కేఎస్‌సీ) డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమయాన్ని వృథా చేయవద్దని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని ముద్దనూరు మండలం యామవరం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో రైల్వే ఉద్యోగి నాగేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రున్ని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన సేవలకు కర్నూలుకు తరలించారు.

బాలుడి అదృశ్యం

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరుకు చెందిన టి.అమర్ అనే రెండేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. ఈమేరకు ఎస్సై వినోద్‌కుమార్ తెలిపారు. ఈ బాలుడు ఈ నెల 3వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సహకార కేంద్ర బ్యాంకు ప్రారంభం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు రామేశ్వరంలో ఏర్పాటు చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకును శనివారం ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, స్వయం ఉపాధి, మహిళ సాధికారత, ఆర్థిక సహాయం, ఉన్నత, విదేశీ విద్య, చిరువ్యాపారులు, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణానికి, గోల్డ్, వాహనాలకు రుణ సదుపాయాలు కల్పిస్తారన్నారు బ్యాంకు సీఈవో రాజమణి, డీసీఎల్‌వో రిజిస్ట్రార్ సురేష్, డీజీఎంఎస్ వెంకటేశ్వర్లు, ప్రతాప్‌రెడ్డి, పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్ట పరిశీలన

రాజుపాలెం: కేసీ కాలువ డీఈఈ ఎం. చిన్నపుల్లయ్య శనివారం రాజోలి ఆనకట్టను పరిశీలించారు. ఏఈ జమాల్‌వల్లిని అడిగి ఆనకట్ట వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేసీ కాలువను జిల్లేల వరకు ఆనకట్టను చూశారు. కుందూనదిలో 9100 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉన్నట్లు తెలిపారు.

నీటిని పరిశీలిస్తున్న కేసీ డీఈఈ చిన్నపుల్లయ్య, పక్కన ఏఈ జమాల్ వల్లి →



ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు టీచర్స్ అసోషియేషన్, సంస్కృతీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలు అందించిన దాదాపు 50 మందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి గానుగపెంట హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థానాలకు ఎదిగినా గురువు అనగానే మొదట గుర్తు వచ్చేది ఓనమాలు నేర్పిన వారేనన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 2015 నుంచి అవార్డు టీచర్స్ అసోసియేషన్ సంస్థతో కలిసి అవార్డులను ప్రదానం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, జమ్మలమడుగు పట్టణానికి చెందిన రాష్ట్ర అవార్డు గ్రహీత చంద్రశేఖర్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఆట అసోషియేషన్‌కు చెందిన విజయమోహన్‌రెడ్డి, అరకటవేముల హరినారాయణ, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


సన్మానగ్రహీతలతో వీసీ కృష్ణారెడ్డి, తదితరులు

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అందరి కర్తవ్యం


సమావేశంలో పాల్గొన్న సంఘాల ప్రతినిధులు

మైదుకూరు, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించుకునే బాధ్యత మాదిగలపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక షాదీఖానాలో ఎమ్మార్పీఎస్‌తోపాటు అనుబంధ సంఘాల ముఖ్య ప్రతినిధుల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల భవిష్యత్తు కోసం కృష్ణమాదిగ చేసిన పోరాట ఫలితంగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రం చట్టబద్ధత కల్పించాల్సి ఉందన్నారు. సమితి ప్రతినిధులు అన్నం సుబ్బయ్య, రాజు, మత్తయ్య, చిన్నయ్య, జీవన్, గంగరాజు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వైఎస్ఆర్ కడప పేరు పెట్టాలి

ప్రొద్దుటూరు: జిల్లాకు వైఎస్సార్ పేరుకు బదులు వైఎస్సారు కడప అని పేరు మార్పు చేయాలని ఏపీ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు పి.శ్రీనాథ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక బొల్లవరం ప్రసన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వైద్యులు వరుణ్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎన్జీవో సంఘం కార్యదర్శి రామసుబ్బయ్య యాదవ్, పాల్గొన్నారు.


వినతి పత్రాలను చూపుతున్న పుర ప్రముఖులు

ఉచితంగా బన్సీ రవ్వ పంపిణీ


రవ్వ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు పట్టణం, దసరా నవరాత్రులను పురస్కరించుకొని గోల్డెన్ బన్సీ రవ్వ ప్యాకెట్లను భక్తులకు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు శివాలయం కూడలిలో కైలాఫ్ గ్రైండ్ మిల్స్ సంస్థ తమ గోల్డెన్స్ బన్సీ 200 గ్రాముల ఉప్మా రవ్వను ఉచితంగా భక్తులకు అందజేశారు. విజయ దశమి వరకు పంపిణీ చేయనున్నట్లు ఆ సంస్థ మేనేజర్ నీలేఫ్ మాన్వియా, రాష్ట్ర సేల్స్ మేనేజర్ వెలకచర్ల కోటేశ్వర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పంపిణీ దారుడు శివా ఏజెన్సీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల షోరూం ప్రారంభం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: స్థానిక మైదుకూరురోడ్డులోని మండి కాంప్లెక్స్‌రోడ్డులో దేవిరెడ్డి రమణారెడ్డి ఏర్పాటు చేసిన నూతన ద్విచక్ర వాహన వెస్పా షోరూంను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూజలు నిర్వహించి వ్యాపారం అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లక్ష్మీరెడ్డి, తెదేపా నాయకులు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, జొన్నలగడ్డ రామచంద్ర, ప్రకాశ్‌రావు, వెస్పా సీనియర్ మేనేజరు క్రాంతికుమార్ పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, రమణారెడ్డి


ఏఎంసీ మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం


ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బండి విజయభాస్కర్ రెడ్డి (59) శనివారం గుండెపోటుతో మరణించారు. స్థానిక పెద్దశెట్టిపల్లెలోని స్వగృహంలో ఉన్న ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, మండల తెదేపా కన్వీనరు బోడెల బాబుల్‌రెడ్డి, కౌన్సిలరు మురళీధర్ రెడ్డి, తెదేపా నాయకులు గంటశాల వేంకటేశ్వర్లు, తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి, పార్టీ నాయకులు ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటించారు.


గండికోటకు కృష్ణా జలాలు

కొండాపురం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు 5 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు శనివారం తెలిపారు. గత నెల 27వ తేదీ అవుకు జలాశయం నుంచి గండికోటకు పంపుతున్న కృష్ణాజలాలను నిలిపివేశారు. ప్రస్తుతం మళ్లీ పంపుతున్నారు. ప్రస్తుతం 24.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే గండికోట ఎత్తిపోతల పథకం నుంచి మూడు మోటార్ల ద్వారా 1500 క్యూసెక్కుల నీటిని సీబీఆర్‌కు పంపుతున్నారు.










భవనాలకు మోక్షమెప్పుడో?

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు

మొదటి ప్రాధాన్యం అంటూ వైకాపా ప్రభుత్వం హడావుడిగా సచివాలయ, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. నిధుల లేమితో కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తికాక, పునాది దశలోనే నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల భవనాలు పూర్తైనా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలో గండికోట వెళ్లే దారిలో గ్రామ సచివాలయ భవనాన్ని రూ. 43.60 లక్షలతో పనులు పూర్తిచేశారు. నిర్మాణ పనులు పూర్తై ఏడాది దాటినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ గ్రామంలో సచివాలయంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. నెలకు అద్దె రూ.2500 చెల్లిస్తున్నట్లు సమాచారం. రూ.17.40 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు పూర్తై ఏడాది కావస్తున్నా అదే పరిస్థితి. పక్కనే రైతు భరోసా కేంద్రానికి నిధులు విడుదల కాకపోవడంతో పునాది దశ దాటలేదు. జమ్మలమడుగు మండల పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పూర్తైన భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



పూర్తయిన గ్రామ సచివాలయ భవనం



కడప

• కడప • పులివెందుల • కమలాపురం

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

వేంపల్లె, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్‌పోటీలకు వేంపల్లె జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆదిశేష్‌రెడ్డి, వెంకటశ్రీరామ్, ప్రతీక్షకుమార్, సాయి, విష్ణు, ఈశ్వర్‌లు, అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన ఆనంద్ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ, పీడీలు రాజశేఖర్, నరేంద్ర జయప్రద, రవికుమార్‌లు అభినందించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సూపర్‌సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అంగడివీధిలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ... ఇప్పటికే పింఛన్లను పెంచామన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, తెదేపా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ గంగం మోహన్‌బాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

తొండూరు మెయిన్ బజార్ మురుగు కాలువలోని పూడికను కార్మికులు తొలగించారు. ఇబ్బందుల సమస్యపై మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారి సాయిప్రతాప్‌రెడ్డి హరితరాయబారులతో పూడిక దిబ్బలను తొలగించారు. - న్యూస్‌టుడే, తొండూరు

?: పట్టణంలోని ప్రదీప్ థియేటర్ ఎదుట రోడ్డు పక్కన చెత్త అస్తవ్యస్తంగా పడింది. దుర్వాసన వస్తోంది. - **శేషయ్య, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను తొలగించే ఏర్పాట్లు చేస్తాం. - **షఫీవుల్లా, శానిటరీ ఇన్‌స్పెక్టర్** - న్యూస్‌టుడే, కమలాపురం

?: కోమన్నూతల నుంచి అంబకపల్లె వరకు రోడ్డు వెంబడి కంపచెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కంపచెట్లు తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. - **రాఘవేంద్ర, ఎగువపల్లె**

✓: కంపచెట్లు తొలగించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటాం. -**మనోహర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ** - న్యూస్‌టుడే, లింగాల

?: నాగరాజుపేటలోని నారాయణ కళాశాల వెనుకవైపు ప్రధాన రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. - **ప్రతిమ, స్థానికురాలు**

✓: సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం.

?: రాజారెడ్డి వీధిలోని డీసీసీ బ్యాంకు వెనుకవైపు ప్రధాన రోడ్డుపై వారం రోజులుగా చెత్త నిల్వలు పేరుకుపోయాయి. - **మారుతీదేవి, స్థానికురాలు**

✓: పరిశీలించి చెత్తను తొలగిస్తాం. - **సచివాలయం పారిశుద్ధ్య అధికారి**

?: మారుతీనగర్‌లోని రోడ్ నెంబరు 1 చివర ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు అధికంగా ఉన్నాయి. దీంతో దోమలు పెరిగిపోయాయి. - **దాదాపీర్, స్థానికుడు**

✓: పరిశీలించి స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం. - **సచివాలయం అధికారి** - న్యూస్‌టుడే, మారుతీనగర్

ఖాళీ స్థలాలు... అపరిశుభ్రతకు నిలయాలు



సూర్య ఉన్నత పాఠశాల వీధిలో రోడ్డు పక్కన మురుగు నిల్వ

కమలాపురం, న్యూస్‌టుడే : కమలాపురం పట్టణంలోని అనేక ప్రాంతాలు అపరిశుభ్రతకు అవాసాలుగా మారాయి. దీంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 20 వార్డుల్లో 1400 ఖాళీ స్థలాలున్నాయి. సొసైటీకాలనీ, మారుతీనగర్, పడమరవీధి, హైడిమాన్‌కాలనీ, కె.అప్పాయపల్లె ఎస్సీ కాలనీ, బీడీ కాలనీ, తెలుగువీధి, సూర్య ఉన్నత పాఠశాల వీధి, గండ్లూరు కాలనీ, ఆక్సానగర్‌తో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. ఈ స్థలాల్లో చెత్తా చెదారం, వ్యర్థాలు పడేస్తుండటంతో అధ్వానంగా మారాయి. ఖాళీ స్థలాల యజమానులు పట్టించుకోకపోవడంతో విషసర్పాలు తిరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై నగర పంచాయతీ అధికారులను వివరణ కోరగా.. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు.

బయటకు వెళ్లాలంటే భయం

రాత్రి వేళల్లో రోడ్లపై పాములు తిరుగుతున్నాయి. మహిళలు, పిల్లలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. స్థల యజమానులు కొనుగోలు చేసి వదిలేశారు. దీంతో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోయి విషపురుగులు సంచరిస్తున్నాయి. - **జయరామయ్య, 13వ వార్డు**

దోమలతో సతమతం

స్థానికులు చెత్త, వ్యర్థాలు కాలువలో వేసి మురుగు ముందుకెళ్లకుండా చేస్తున్నారు. దీంతో పాటు వాననీరు చేరి దుర్వాసన, దోమలు అధికమవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - **చెన్నమ్మ, ఒకటో వార్డు**

మార్క్‌ఫెడ్‌తోనే గిట్టుబాటు ధర

లింగాల, పులివెందుల (వేంపల్లె),న్యూస్‌టుడే : రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పులివెందుల వాసి, భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డిని ఆ పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు శశిభూషణ్‌రెడ్డి విజయవాడ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ బాలప్రసాద్, పార్టీ పులివెందుల నియోజకవర్గ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నవీన్‌లు శశిభూషణ్‌రెడ్డిని కలిసి అభినందించారు. మార్క్‌ఫెడ్‌తో రైతులకు గిట్టుబాటు ధర సాధ్యమవుతుందన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చింతకొమ్మదిన్నె : చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ చట్టాల గురించి తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ శ్రీధర్, గ్రామీణ సీఐ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఛైర్మన్లకు ఎమ్మెల్సీ సత్కారం



మంతెన రామరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లను శనివారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. అమరావతి, మంగళగిరి కార్యాలయాలలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నూకసాని బాలాజీలను ఎమ్మెల్సీ కలిసి వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వైవీయూ రిజిస్ట్రార్‌ను తొలగించాలని వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వైవీయూ రిజిస్ట్రార్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని కోరుతూ డీవైఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. కడపలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పలు అంశాలు వివరించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి రిజిస్ట్రార్ పదవి ఇవ్వడంలో అర్థం లేదన్నారు.

రాకపా జిల్లా కన్వీనర్ల ఎన్నిక

మారుతీనగర్, న్యూస్‌టుడే : రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నూతన కమిటీల ఎన్నిక కోసం జిల్లా కన్వీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు రాకపా రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించామని, రాయలసీమ వ్యాప్తంగా పార్టీ పునర్నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మహాసభలు జరిగే కన్వీనింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిటీలో నిర్ణయం చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కన్వీనర్‌గా మల్లె గంగాధర్, అనంతపురం జిల్లా కన్వీనర్‌గా అక్బర్, వైఎస్సార్ జిల్లాకు మక్బూల్‌బాషాను రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

ఉద్యోగ బాధ్యతల స్వీకరణ

కమలాపురం : కమలాపురం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా శ్రీనివాసులరెడ్డి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రాయచోటిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీఈ మురళీ రాయచోటికి వెళ్లారు. ● కమలాపురం ఈవోపీఆర్డీగా ఎల్.కెజియా శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవోపీఆర్డీ శారదమ్మ పులివెందులకు బదిలీపై వెళ్లారు. ● కమలాపురం వెలుగు ఏపీఎంగా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం అపర్ణ ముద్దనూరుకు బదిలీపై వెళ్లారు.

వక్ఫ్ భూములపై చట్ట సవరణలు సరికాదు

మారుతీనగర్, న్యూస్‌టుడే : వక్ఫ్ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే కేంద్రంలోని భాజపా ప్రభుత్వం సవరణలు తీసుకురావడం బాధాకరమని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు బాదుల్లా ఆరోపించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భాజపా ప్రభుత్వం రూ.కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు ఆస్తులు, లక్షల ఎకరాల భూములు ముస్లింలకు సంబంధం లేకుండా చేసే సవరణలను జాయింట్ పార్లమెంటరీ కమిటీ అభిప్రాయ సేకరణ నామమాత్రంగా నిర్వహిస్తుందని ఆరోపించారు. ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

చక్రాయపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అద్దాలమర్రిక్రాసు చెక్‌పోస్టు సమీపంలో వేంపల్లి నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రంగారావు శనివారం తెలిపారు. 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వెల్లడించారు.

జగన్మాత.. నమోస్తుతే



అమ్మవారిశాలలో దర్శనానికి వచ్చిన భక్తులు




దేవుని కడపలో చంద్రప్రభ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి



వల్లూరులో ధనలక్ష్మీదేవిగా వాసవీ మాత



శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంటాలంకరణలో అమ్మవారు



కమలాపురంలో రాజేశ్వరీదేవిగా...

దసరా నవరాత్రి ఉత్సవాలు కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలలో వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి ఏకాంత పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. - **న్యూస్‌టుడే బృందం**



వేములలో గాయత్రిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



తొండూరులో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

సచివాలయ ఉద్యోగుల సర్దుబాటు

కడప నగరపాలక, న్యూస్‌టుడే : కడప నగరపాలక సంస్థలోని కొందరు సచివాలయ ఉద్యోగులను అదనపు బాధ్యతల నుంచి తప్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం గతంలో కొన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న సెక్రటరీలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. డబ్ల్యూఎస్ఈఎస్ హోదాలోని అయిదుగురు సెక్రటరీలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అమెనిటీస్ సెక్రటరీలుగా ఉన్న 9 మందిని ఏఈలుగా, అడ్మిన్ హోదాలో పని చేసే అయిదుగురిని ఆర్ఐలుగా, వివిధ సచివాలయాల్లో సెక్రటరీలుగా ఉన్న వారిని కంట్రోల్‌రూమ్‌లో నియమిస్తూ గతంలో ఉత్తర్వులిచ్చారు. వారందిరినీ అదనపు బాధ్యతల నుంచి తప్పించారు.

చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు అమలు చేయాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీరభాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం కడపలోని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ పిచ్చేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 45 ఏళ్లు పైబడిన నేతన్నలకు పింఛనుతో పాటు వర్కు షెడ్యూల్, క్లస్టర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. నాయకులు చిన్నా, ఆంజనేయులు, హరి, చౌడంపుల్లయ్య, మహేశ్, మంజునాథ, ప్రభు పాల్గొన్నారు

జీవిత బీమా సమస్యల పరిష్కారానికి వినతి



సూపరింటెండెంట్ తస్లీమా సుల్తానాకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సామూహిక జీవిత బీమా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం కడప నగరంలోని జీవితబీమా కార్యాలయంలో సూపరింటెండెంట్ తస్లీమా సుల్తానాకు ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీజీఎల్ఐ బాండ్ల గడువు తీరినా ఉపాధ్యాయులకు చివరి మొత్తాలు చెల్లించడంలోనూ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు రుణాలు చెల్లించడంలోనూ సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన ఉపాధ్యాయులకు రావాల్సిన మొత్తాలను వారి కుటుంబసభ్యులకు చెల్లించడంలో ఆలస్యమవుతోందన్నారు. ఏపీజీఎల్ఐ నూతన బాండ్ల జారీలో ఏర్పడిన సాంకేతిక సమస్యలను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరివ్వాలని మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం-1 పరిధి రామకృష్ణాపురంలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ శనివారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సిద్దవటం పెన్నానది నుంచి తమ ప్రాంతానికి కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా రావడం లేదన్నారు. వారానికి ఒకరోజు ఒక గంట మాత్రమే నీరు వస్తాయన్నారు. నీటి సమస్య పరిష్కారానికి పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కడప విద్య, : కడప నగరం బెల్లంమండి వీధిలోని మదరసా జేహరాలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆల్‌ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) ఆధ్వర్యంలో ఆదర్శ ఉపాధ్యాయులను సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్మీడియట్ నుంచి పీజీ విద్యార్థులకు మొహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై తెలుగు, ఉర్దూ, ఆంగ్లంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన 17 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

చింతకొమ్మదిన్నె : మండల రెవెన్యూ కార్యాలయాన్ని శనివారం ఆర్డీవో జాన్ ఇర్విన్ సందర్శించారు. కార్యాలయంలోని పలు దస్త్రాలను పరిశీలించారు. ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన, గ్రామాల వారీగా ఉండే భూ సమస్యల గురించి తహసీల్దారు నాగేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



కమలాపురం పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రధాన రోడ్డు మురుగు కాలువపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గుంతపైన రాళ్లు వేసి కప్పేశారు తప్ప గుంతను పూడ్చే చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో దగ్గరకు వచ్చే వరకు రాళ్లు కనిపించక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గొయ్యికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కమలాపురం**

నేత్రదానం పుణ్యకార్యం



కరుణాకర్‌రెడ్డికి జ్ఞాపికనందిస్తున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి

పులివెందుల (వేంపల్లె),న్యూస్‌టుడే : నేత్రదానం మహాపుణ్యకార్యమని ఈ విషయమై అందరూ నేత్రదానానికి నడుం బిగించాలని పులివెందుల జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముదివేటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కరుణాకర్‌రెడ్డి సోదరి తులసిదేవి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు స్నేహిత అమృతహస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో ఆమె కళ్లను దానం చేశారు. ఈ సందర్భంగా శనివారం సేవాసమితి అధ్యక్షుడు రాజుతో కలిసి న్యాయమూర్తి కరుణాకర్‌రెడ్డికి జ్ఞాపిక నందించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు న్యాయమూర్తి శ్రీనివాసులు, సీనియర్ న్యాయమూర్తి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల వితరణ

పులివెందులలోని విభిన్న ప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఉన్న దివ్యాంగులకు సీనియర్ న్యాయవాది కరుణాకర్ రెడ్డి నిత్యావసరాలు అందజేశారు. తన తండ్రి వెంకటనారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా 30 కుటుంబాలకు బియ్యం, ఇతర నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దివ్యాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, వేణు, రాజు, తదితరులు పాల్గొన్నారు.